రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మేడ్చల్: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మేడ్చల్ పోలీసుల కథనం ప్రకారం.. గిర్మాపూర్‌కు చెందిన సత్యనారాయణ(70) సోమవారం ఉదయం ఇంటి నుంచి రాయిలాపూర్ వైపు ఉన్న తన పొలానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని కండ్లకోయలో ఉన్న సీఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దసరాకు 6,304 ప్రత్యేక బస్సులు

టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా 6,304 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రయాణికుల సంక్షేమార్థం ఆర్టీసీకి పోలీస్, రవాణాశాఖలు సహకరించాలని కోరారు. దసరా ఆపరేషన్స్‌పై హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో సోమవారం సజ్జనార్ అధ్యక్షతన పోలీస్, రవాణాశాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. టీజీఎస్ఆర్టీసీలో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని, అందుకే ప్రజలు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఈ నెల 9 నుంచి 12 వరకు అధిక రద్దీ ఉండే అవకాశం ఉండటంతో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. 'మహాలక్ష్మి' పథకం దృష్ట్యా గత ఏడాదితో పోల్చితే అదనంగా 600 ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఎల్బీనగర్, ఆరాంఘర్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, బోయిన్‌పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్‌సదన్, బోరబండ, శంషాబాద్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. జేబీఎస్ నుంచి 1,602, ఎల్బీనగర్ నుంచి 1,193, ఉప్పల్ నుంచి 585, ఆరాంఘర్ నుంచి 451అదనపు బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. తిరుగు ప్రయాణం రద్దీ దృష్ట్యా 13, 14 తేదీల్లోనూ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ముందస్తు రిజర్వేషన్ కోసం tgsrtcbus.inలో బుక్ చేసుకోవాలని, పూర్తి సమాచారం కోసం 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. హైదరాబాద్ సిటీ అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. పండుగ వేళల్లో టీజీఎస్ఆర్టీసీకి తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్ డేవిస్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, అశోక్ కుమార్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాసులు, మనోహర్, ట్రాఫిక్ అదనపు డీసీపీలు వీరన్న, మాజిద్, ఆర్టీఏలు వాణి, పురుషోత్తంరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్‌కుమార్, ఆర్ఎంలు శ్రీలత, వరప్రసాద్, కేఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కేఏ పాల్

ఏపీ డిప్యూటీ సీఎం వ్యాఖ్యలపై
పంజాగుట్ట పీఎస్‌లో కేఏ పాల్ ఫిర్యాదు

ఖైరతాబాద్, అక్టోబర్ 7: తిరుపతి లడ్డూ విషయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ సోమవారం పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి నుంచి కల్తీ చేసిన లక్ష లడ్డూలు అయోధ్యకు పంపించారంటూ చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. అయోధ్య ప్రారంభమైందే జనవరిలో అని, ఆయన ఉప ముఖ్యమంత్రి జూన్‌లో అయ్యారని, ఆయన చేసిన ఆరోపణలు ఎలా నిజమవుతాయని ప్రశ్నించారు. పవన్‌పై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఆయనను మంత్రి పదవి నుంచి కూడా బర్తరఫ్ చేయాలన్నారు. హిందువులకు పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయ కేంద్రాలపై ఎస్‌టీఎఫ్ దాడులు

నలుగురి అరెస్ట్.. మరో 44 మందిపై కేసులు
24.460 కిలోల గంజాయి సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ధూల్‌పేటలోని పలు చోట్ల ఉన్న గంజాయి విక్రయకేంద్రాలపై ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి, ఏడుగురు గంజాయి విక్రయదారులతో పాటు 37 మంది వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి 24.460 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన కిశోర్ సింగ్, జ్యోతిబాయ్ కలిసి తన నివాసంలో గంజాయి విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ బృందం కిశోర్‌సింగ్ ఇంటిపై దాడులు జరిపి, 22.9 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఈ కేసులో గంజాయి విక్రయిస్తున్న కిశోర్‌సింగ్, జ్యోతిబాయ్‌ని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న లడ్డూ సింగ్, సాగర్‌సింగ్, వైష్ణవి సింగ్, పేపర్ వినోద్ సింగ్‌పై కేసులు నమోదు చేసినట్లు ఈఎస్ తెలిపారు. అదే విధంగా.. పురానాపూల్, జియాగూడ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ బృందాలు.. పురానాపూల్‌లో దాడులు నిర్వహించి అభి

షేక్ సింగ్, సుభాయ్ సింగ్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.560 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా.. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న మహేందర్‌సింగ్, గుడ్డూసింగ్, రోహిత్ యాదవ్‌తో పాటు గంజాయి వినియోగిస్తున్న 37మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఈఎస్ అంజిరెడ్డి వెల్లడించారు.

భవనం పైనుంచి పడి కూలీ మృతి

బాలానగర్, అక్టోబర్ 7: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఓ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ నరసింహారాజు కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కమలేశ్ మేశ్రా (46) చింతల్ పద్మానగర్ ఫేజ్- 1లో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో గత మూడు నెలలుగా కూలీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం పనికి వచ్చాడు. భవనం ముందు భాగంలో ప్లాస్టింగ్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి 5వ అంతస్తు పైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో కమలేశ్ మేశ్రాకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షలు నష్ట పరిహారం కింద చెక్కలు అందజేసినట్లు సమాచారం.

కిడ్నాప్, హత్య కేసులో ఐదుగురి అరెస్టు

వివరాలు వెల్లడించిన డీసీపీ కోటిరెడ్డి

జీడిమెట్ల, అక్టోబర్ 7: తనకు ఇవ్వాల్సిన డబ్బును అడిగినందుకు ఓ వ్యక్తిని కిరాయి గుండాలతో కలిసి కిడ్నాప్ చేసి, హత్య చేసిన ఘటనలో నిందితులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సోమవారం బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ఈస్ట్ సాయినగర్ అల్విన్ కాలనీకి చెందిన కోయ వెంకటప్పన్న రెడ్డి (54) 2022లో కాకినాడ ఓడరేవు వద్ద చిత్తూరు జిల్లాకు చెందిన బెతిన ద్వారకానాథ్ రెడ్డితో కలిసి క్యాటరింగ్ బిజినెస్ చేశారు. ఇద్దరి మధ్య డబ్బుల లావాదేవీల్లో గొడవలు మొదలయ్యాయి. వెంకటప్పన్నరెడ్డికి ద్వారకానాథ్ రెడ్డి రూ.28 లక్షలు బాకీ పడ్డాడు. అనంతరం డబ్బులు ఇవ్వకుండా ద్వారకానాథ్ రెడ్డి కాకినాడ నుంచి కుటుంబంతో సహా మరో ప్రాంతానికి వెళ్లిపోయాడు. వెంకటప్పన్న రెడ్డి కూడా కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చి బాలానగర్‌లోని మెగా కంపెనీలో ఏజీఎంగా ఉద్యోగంలో చేరాడు. ఇటీవల ద్వారకానాథ్ రెడ్డి తిరుపతిలో ఉన్నట్లు తెలుసుకున్న వెంకటప్పన్న.. అక్కడికి వెళ్లాడు. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని ద్వారకానాథ్‌పై ఒత్తిడి చేయగా.. వెంకటప్పన్నకు చెక్కులు ఇచ్చాడు. ఆ చెక్కులు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. అప్పటి నుంచి వెంకటప్పన్న డబ్బుల విషయంలో ద్వారకా నాథ్‌పై ఒత్తిడి చేయసాగాడు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

ప్లాన్ చేసి కిడ్నాప్..

ఎలాగైనా వెంకటప్పన్నను హత్య చేసి డబ్బులు ఎగ్గొట్టాలని ద్వారకానాథ్ ప్లాన్ చేశాడు. ఈ నెల 4వ తేదీన కడప జిల్లాకు చెందిన బసిరెడ్డి సుధాకర్ రెడ్డి (59) పాశం ప్రసాద్ (36), కిరణ్ కుమార్ (30), గడ్డం వెంకటసుబ్బయ్య (25), మణికంఠ (25)తో కలిసి ద్వారకానాథ్ రెడ్డి తన మహీంద్ర కారులో హైదరాబాద్‌కు వచ్చాడు. ప్లాన్ ప్రకారం ఆరోజు రాత్రి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రీనగర్‌లో వెంకటప్పన్న రెడ్డిని బలవంతంగా లాక్కెళ్లి కారులో పడేశారు. అనంతరం అతడికి క్లోరోఫాం ఇవ్వడంతో స్పృహ కోల్పోయాడు. అక్కడి నుంచి వెంకటప్పన్నను కొత్త కోటకు తీసుకెళ్లారు. అక్కడ వెంకటప్పన్న కాళ్లు, చేతులు కట్టేసి బీచుపల్లి బ్రిడ్జి పైనుంచి కృష్ణా నదిలో పడేశారు. ఇదిలా ఉండగా.. వెంకటప్పన్నరెడ్డి 4వ తేదీ రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడి భార్య హేమ 5వ తేదీన జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఉన్నతాధికారుల సలహాతో దర్యాప్తు చేపట్టి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. అనంతరం పోలీసులు చాకచక్యంగా నిందితులను పట్టుకుని ప్రశ్నించగా.. వెంకటప్పన్నను కృష్ణానదిలో పడేసినట్లు ఒప్పుకున్నారు. పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృత దేహం కోసం గాలించగా.. 15 కిలోమీటర్ల దూరం.. పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో మృతదేహం లభించింది. ప్రధాన నిందితుడు ద్వారకానాథ్ రెడ్డి పరారీలో ఉండగా.. మిగిలిన ఐదుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంతో ఈవెంట్లు

ఆబ్కారీ దాడులు.. కేసులు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. సొంత ఖజానా నింపుకొనే క్రమంలో నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంతో ఈవెంట్లు నిర్వహిస్తున్న రిసార్ట్స్‌పై శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు వేర్వేరు రిసార్ట్స్‌ల్లో అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని వినియోగిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి వద్ద నుంచి సుమారు రూ.3 లక్షల విలువ చేసే 75 ఖరీదైన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఈఎస్ డా.కృష్ణప్రియ కథనం ప్రకారం.. మొయినాబాద్, వెంకటాపురం ప్రాంతంలోని రెయిన్‌బో రిసార్ట్స్ ఫామ్‌హౌస్‌లో నిర్వాహకులు ఆబ్కారీ శాఖ అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పాండిచ్చేరి నుంచి తీసుకువచ్చిన నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని వినియోగించారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు రెయిన్‌బో రిసార్ట్స్‌పై దాడులు జరిపి రిసార్ట్స్ యాజమాన్యంతో పాటు ఈవెంట్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.2.12 లక్షల విలువ చేసే 53 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా.. అదే ప్రాంతంలోని అవిన్య కన్వెన్షన్ హాల్‌పై దాడులు జరిపి రూ.88,000 విలువ చేసే 22 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఈఎస్ వెల్లడించారు.

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 7: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తిని నమ్మించి మోసం చేసిన ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హుమాయున్‌నగర్ నివాసి ఎన్‌టీ. జగన్నాథ్ చార్టెడ్ అకౌంటెంట్. అతడికి ఆరునెలల కిందట సాయిచంద్ గౌడ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రముఖ ఆభరణాల సంస్థలకు తాను బంగారం సరఫరా చేస్తుంటానని, తక్కువ ధరకు బంగారం ఇస్తానంటూ నమ్మబలికాడు. 100 గ్రాముల బంగారం మార్కెట్‌లో సుమారు రూ.7లక్షలు ఉంటుందని, తాను రూ.6 లక్షలకే ఇస్తానంటూ చెప్పాడు. అతడి మాటలు నమ్మిన జగన్నాథ్.. జూన్ 23న బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో సాయిచంద్‌గౌడ్‌కు రూ.3 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. మరుసటి రోజే బంగారం ఇస్తానంటూ వెళ్లిన సాయిచంద్.. వివిధ కారణాలు చెబుతూ దాటవేయడం ప్రారంభించాడు. ఎన్నిసార్లు అడిగినా బంగారం ఇవ్వకపోగా.. బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడు సాయిచంద్ గౌడ్‌తో పాటు అతడికి సహకరించిన మరో వ్యక్తిపై కేసు దర్యాప్తు చేపట్టారు.

అలయ్, బలయ్ ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

13న అలయ్ బలయ్

అబిడ్స్, అక్టోబర్ 7: రాజకీయాలకతీతంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈ నెల 13వ తేదీన అలయ్, బలయ్ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని అలయ్, బలయ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎగ్జిబిషన్ మైదానంలోని పెండాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. అలయ్, బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం దసరా మరుసటి రోజు అలయ్, బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా అందరిని ఆహ్వానిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రులు, అధికార, అనధికార ప్రముఖులు అందరిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందరిని ఒకే వేదికపైకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ అలయ్, బలయ్ కార్యక్రమాన్ని మొదట నిర్వహించి, ఆ తర్వాత ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్మన్ బండారు విజయలక్ష్మి మాట్లాడుతూ.. 2005లో ప్రారంభమైన అలయ్ బలయ్.. ఈ సారి 19వ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. భారీ సంఖ్యలో హాజరయ్యే అతిథులు, ప్రజల కోసం మైదానంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడతామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, కార్పొరేటర్లు జి.శంకర్ యాదవ్, లాల్‌సింగ్, రాకేశ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

వాయిదాలు చెల్లించడంలేదని.. యువకుడిని బంధించారు..

మేడ్చల్, అక్టోబర్ 7: వాహనానికి సంబంధించిన వాయిదాలు చెల్లించకుండా ముఖం చాటేస్తున్నాడని ఓ యువకుడిని ఆటో ఫైనాన్స్ నిర్వాహకులు బంధించి, దాడి చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆ యువకుడిని ఫైనాన్సర్ల చెర నుంచి విడిపించారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన ఉదయ్ మేడ్చల్‌లోని ఆదిత్య బైక్ జోన్ నుంచి వాయిదాల పద్ధతిలో ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఒకే వాయిదా చెల్లించాడు. ఆ తర్వాత తన ఫోన్ చెడిపోవడం, స్థానికంగా లేని కారణంగా వాయిదాలు చెల్లించలేదు. బైక్ జోన్ నిర్వాహకులకు కూడా ఎలాంటి సమాచారమివ్వలేదు. ఉదయ్ తన తల్లి చికిత్స నిమిత్తం సురారం మల్లారెడ్డి ఆస్పత్రికి వచ్చాడు. విషయాన్ని తెలుసుకున్న ఫైనాన్స్ నిర్వాహకులు ఆస్పత్రి వద్దకు వచ్చి అక్కడి నుంచి ఉదయ్‌ని మేడ్చల్‌కు తీసుకువచ్చారు. కార్యాలయంలోకి తీసుకెళ్లి బట్టలు విప్పి కొట్టారని, పరుష పదజాలం ప్రయోగించారని ఉదయ్ ఆరోపించాడు. దాదాపు రెండు గంటల పాటు ఇబ్బంది పెట్టారని తెలిపాడు. పోలీసులు వచ్చిన తర్వాత తనను విడిచిపెట్టారని తెలిపాడు. ఉదయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టా పేజీలో అసభ్య వీడియోలు

నిర్మాత ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 7: ఉద్యోగంలో నుంచి తొలగించారన్న కోపంతో సంస్థకు చెందిన సోషల్‌మీడియా పేజీలో అసభ్యకరమైన వీడియోలు పోస్ట్ చేసిన అసిస్టెంట్ డైరెక్టర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సినీ నిర్మాత, దర్శకుడు షేక్ నాగుల్ షరీఫ్ అనే వ్యక్తి త్వరలో నిర్మించనున్న ఓ సినిమాకు సంబంధించిన కార్యాలయాన్ని బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని సాగర్ సొసైటీలో ఏర్పాటు చేశాడు. అతడి వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న టి.సృజన్ సాయికి సినిమాకు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ అఫీషియల్ పేజీ నిర్వహించే బాధ్యతలను అప్పగించాడు. నటీనటులతో పాటు ఇతర సాంకేతిక నిపుణులు అఫీషియల్ పేజీని ఫాలో అవ్వాలని నిర్మాత నాగుల్ షరీఫ్ సూచించాడు. ఇటీవల సృజన్ సాయి ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో అతడిని ఉద్యోగం లోనుంచి తీసేశారు. దీంతో ఆఫీసుకు వచ్చిన సృజన్ సాయి అక్కడి సిబ్బంది పట్ల దుర్భాషలాడి, సినిమాకు చెందిన అఫీషియల్ పేజీ పేరు మార్చడంతో పాటు అసభ్యకరమైన వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేశాడు. పేజీని ఫాలో అవుతున్న మహిళలకు వాటిని పంపించాడు. ఈ మేరకు దర్శక, నిర్మాత షేక్ నాగుల్ షరీఫ్ సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన.. బాలుడిపై పోక్సో కేసు నమోదు

జీడిమెట్ల, అక్టోబర్ 7: ఆరేండ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన బాలుడిపై జీడిమెట్ల పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చింతల్‌కు చెందిన ఓ బాలుడు (14) స్థానికంగా పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 2న కాలనీ మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. ఈ సమయంలో బాలుడు వారి ఇంటికి సమీపంలో ఉండే ఆరేండ్ల బాలికకు పండ్లు ఇస్తానని చెప్పి.. తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. అనంతరం బాలిక పట్ల అసభ్యంగా (బ్యాడ్ టచ్) ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో.. వారు ఆదివారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా..బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

పిల్లలను అప్పగించాలని తల్లిదండ్రుల ఆందోళన

వెంగళరావునగర్, అక్టోబర్7: తమ పిల్లలను తమకు అప్పగించాలని కోరుతూ యూసుఫ్‌గూడ స్టేట్ హోమ్ శిశువిహార్ ఎదుట సోమవారం తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పిల్లలను కొనగోలు చేశారనే ఆరోపణలతో గత మే నెల 8వ తేదీన అధికారులు 9 మంది పిల్లలను మేడిపల్లి నుంచి తీసుకొచ్చి శిశువిహార్‌లో చేర్పించారు. పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించాలని హై కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ సాయంత్రం వరకు జాప్యం చేసి పోలీసులతో గెంటేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని శిశు విహార్ అధికారులు వారికి తెలిపారు. ఆందోళన చేస్తున్న వారిని మధురానగర్ పోలీసులు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కేరళ మహాం మాంత్రికుడు

★కేరళ మహం మంత్రికుడు శ్రీ పురుష వశీకరణ స్పెషలిస్ట్ పండిత్ విశ్వరాజ్ : భార్యాభర్తల కలహాలు, శత్రు నాశనం, ప్రేమ సమస్యలు & మీ ఎటువంటి సమస్యలకైనా 5 గంటల్లో 100% పరిష్కారం. ఫోన్‌లో పరిష్కారం చేయగలరు. 8121931984.
NT-334815

GOLD FINANCE



★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-335055

DASARA OFFER

★Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516.
NT-333073

OLD AGE HOME



★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 8074327715.
NT-334825

PLOT FOR SALE

★నాగార్జునసాగర్ హైవే యాచారం టౌన్‌లో గజం: రూ. 8,990/- DTCP అప్రూవల్ లేఅవుట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్పాట్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. Ph: 9014297729, 8919631310.
NT-338776

★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 9666607146.
NT-338784

★Yapral Near Durgamma Temple, 135 Sq.yds., East Face, Bore & Electricity is available. Plots Size: 30 x 41, 20 Ft. Road. Plz. Contact: 9849606836, 9100278027.
NT-334809

PLOT FOR SALE

★దసరా స్పెషల్ ఆఫర్... శ్రీశైలం మెయిన్ రోడ్‌లో కందుకూర్ టౌన్‌లో HMDA ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీ, పోచారం దగ్గర HMDA ఓపెన్ ప్లాట్లు, ఆలేరు మెయిన్ రోడ్‌లో వీకెండ్ హోమ్స్ ప్లాట్లు కలవు. 7095344396.
NT-335076

PLOT FOR SALE

★విజయవాడ హైవే